నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ బుధవారం 17 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL




ఆదిలాబాద్ పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# గులాబీ శ్రేణులకు.. కేటీఆర్ దిశానిర్దేశం

## ఉత్సాహం నింపిన యువనేత పర్యటన

- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- అడుగడుగునా యువకిశోరం ప్రసంగానికి యువత కేరింతలు





### కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

*- జోగు రామన్న, మాజీ మంత్రి*



పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు పాత్ర కీలమన్నారు. ప్రతి ఇంటికి మూడు నుంచి ఆరు పథకాలు అందాయని, లబ్ధిదారులతో మాట్లాడి ఓటును అభ్యర్థించాలని కోరారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఎన్నికల సమయంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యాన్ని వివరించాలని కోరారు. సిమెంటు పరిశ్రమ విషయంలో కేంద్ర మంత్రి అమిత్‌షా ఇచ్చిన హామీని మరిచారని, ఎయిర్‌పోర్టు, ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వే లైన్ ఏర్పాటు విషయాలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.



ఆదిలాబాద్ పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

### కేసీఆర్‌కు గెలుపును బహుమతిగా ఇద్దాం..

బీఆర్ఎస్‌ను గెలిపించి తమ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు అన్నారు. కేసీఆర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారని, రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడం, పోడు భూములకు పట్టాల పంపిణీ, జోడేఘాట్‌లో మ్యూజియం ఏర్పాటు, దండారీ ఉత్సవాలు, ఆలయాలు, జాతరలకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ, తాగునీరు, సాగునీరు, కల్యాణలక్ష్మి ఇతర పథకాలు బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతాయని ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు.

*- ఆత్రం సక్కు, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి*

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా పర్యటన గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశంలో కార్యకర్తలకు యువనేత కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. పార్లమెంట్ పరిధిలో నిర్మల్, ముథోల్, కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకులు పార్టీని వీడినా నష్టం ఏమి లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు మంత్రి పదవి అనుభవించినా కూడా.. ఓటమి తర్వాత పదవుల కోసం పార్టీలు మారినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆత్రం సక్కు సేవలు పార్టీకి, రాష్ట్రానికి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అవసరమని గుర్తించిన బీఆర్ఎస్ అధినేత ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. కార్యకర్తలు గ్రామస్థాయిలో కష్టపడి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు.

### బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలు ఎండగట్టాలి..

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలని ప్రజలకు తెలియజేయాలని యువకిశోరం కేటీఆర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటు, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభం లాంటి విషయాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడచినా ఎన్నికల హామీలను నేరవేర్చలేదని తెలిపారు. రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ, తులం బంగారం, గ్రామాల్లో మంచినీరు, సాగునీటి సమస్యలను ఎండగట్టాలన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలను యువతకు తెలియజేయాలని సూచించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీల ఆవశ్యకతను తెలియజేయాలని తెలిపారు. కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. యువనేత కేటీఆర్ ప్రసంగానికి గులాబీ శ్రేణులు కేరింతలు కొట్టారు. ఆయనను కలువడానికి, ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. ఈ సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు, కుమ్రం భీం మనవడు సోనేరావు, జడ్పీ చైర్మన్‌లు రాథోడ్ జనార్దన్, విజయలక్ష్మి, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ముథోల్ నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు రమాదేవి, విలాస్ గాధేవార్, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్మెవార్, నాయకులు సుభాష్, యూనిస్ అక్బానీ, అజయ్, జోగు మహేందర్, లింగారెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలోకి జడ్పీ చైర్మన్‌ను ఆహ్వానిస్తున్న కేటీఆర్

### బీఆర్ఎస్ పార్టీలో చేరిన జడ్పీ చైర్మన్

ఎదులాపురం, ఏప్రిల్ 16 : ఇటీవల బీజేపీ కండువా కప్పుకున్న ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తోపాటు పలువురు నాయకులు తిరిగి మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఇటీవల బీజేపీలో చేరిన జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి తిరిగి ఆహ్వానించారు. బీజేపీలో సరైన ప్రాధాన్యత, గుర్తింపు లేకపోవడం వల్లనే మళ్లీ బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు జడ్పీ చైర్మన్ తెలిపారు.



సక్కును ఎంపీగా గెలిపించాలని కోరుతున్న కేటీఆర్



సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీల ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళా కార్యకర్తలు

### ప్రతి బూత్‌లో 300 ఓట్లు రావాలి..

*- అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే*



ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 2,111 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, గ్రామస్థాయి నాయకులు ప్రతి పోలింగ్ బూత్ నుంచి బీఆర్ఎస్‌కు 300 ఓట్లు పడేలా కష్టపడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. పక్కా ప్రణాళికతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీల ఆవశ్యకతను వివరించాలన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని, ఈ ఎన్నికల్లో గెలిస్తే పంచాయతీ, మున్సిపాలిటీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు సంపాదిస్తుందన్నారు.

---




మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్

## రేవంత్‌రెడ్డి ఖబడ్దార్

### మాదిగలతో పెట్టుకోకు : ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్

ఎదులాపురం, ఏప్రిల్ 16 : నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉన్నా.. ఒక్క సీటు ఇవ్వకుండా.. మాదిగలకు ఏదో ఒరగబెట్టినట్లు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాదిగలను అణచివేస్తూ.. ఒకే సామాజిక వర్గానికి రేవంత్‌రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంపై మంద కృష్ణ మాదిగ గురించి అహంకారంతో మాట్లాడడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి శ్రీను, సందీప్, అజయ్, గణేశ్, రాజు పాల్గొన్నారు.

## నివేదికను అందజేయండి..

### నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

బాసర, ఏప్రిల్ 16 : బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. విద్యార్థి ఆత్మహత్యపై ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ట్రిపుల్ ఐటీ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్య బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో జరిగిన ఘటనలు, తీసుకున్న చర్యలపై నివేదికను అందజేయాలన్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి, 60-65 మంది విద్యార్థుల బృందాలకు ఒక ఫ్యాకల్టీని కేటాయించాలని, క్రమం తప్పకుండా విద్యార్థులను కలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని, కౌన్సెలింగ్ సెషన్‌లను నిర్వహించాలని సూచించారు. సహ పాఠ్యకార్యకలాపాలతో విద్యార్థులకు ప్రోత్సహించాలన్నారు. హాస్టల్ కారిడార్‌లో సీసీ టీవీలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అధికారులు మహేశ్, చంద్రశేఖర్, పావని, వినోద్, శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## సివిల్స్‌లో మెరిసిన శుభం

- యూపీఎస్సీ ఆలిండియా స్థాయిలో 790వ ర్యాంకు
- ఒకవైపు ఉద్యోగం చేస్తూనే.. మరోవైపు ప్రిపరేషన్..
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు, మండల ప్రజలు



రేకుల్‌వార్ శుభం





శుభంకు స్వీట్ తినిపిస్తున్న అన్నయ్య నిలేశ్, హారతి చేస్తున్న తల్లి గీత

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 16 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన రేకుల్‌వార్ శుభం యుపీఎస్సీ సివిల్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 790 ర్యాంకు సాధించాడు. మాజీ రిపోర్టర్ సత్యనారాణయగౌడ్-గీత దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు నీలేశ్ మీ సేవా కేంద్రాన్ని నడిపిస్తున్నాడు. రెండో కుమారుడు బాంబేలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడో కుమారుడు రేకుల్‌వార్ శుభం మండల కేంద్రంలోని ప్రతిభ ప్రైవేట్ పాఠశాలలో 1వ తగరతి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నాడు. కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాడు. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. అస్సాంలోని గోవాటిలోని ఐఐటీలో బీటెక్‌లో నాలుగు సంవత్సరాలు చదువుకున్నాడు. అనంతరం ఉద్యోగం చేస్తూనే ఢిల్లీలోని విజన్ ఐఏఎస్ అకాడమీలో రెండేండ్ల శిక్షణ తీసుకున్నాడు. యూపీఎస్సీ సివిల్ పోటీ పరీక్షలు నాలుగు సార్లు రాశాడు. 2024లో వెలువడిన ఫలితాల్లో 790వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో కుటుంబీకులతోపాటు ముత్నూర్ గ్రామస్తులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

## శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి

### నేడు ఊరూరా వివాహ మహోత్సవం

రాములోరి కల్యాణ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఊరూరూ ముస్తాబైంది. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు, షామియానాలు, బారీకేడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశముండగా, అందుకనుగుణంగా ఆలయ కమిటీలు వసతులు కల్పించాయి. తాగు నీరు, అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

